వైభవంగా శ్రీరామనవమి వేడుకలు



సంగం: జంగాలదొరువులో మంగల్యాన్ని చూపుతున్న అర్చకుడు



సంగం: కల్యాణాన్ని, తిలకిస్తున్న భక్తులు

కావలి: కావలి నియోజకవర్గంలోని వాడవాడలా శ్రీరామనవమి వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని జనతాపేట నార్త్, జనతాపేట సౌత్, వైకుంఠపురం, వాయునందన ప్రెస్‌వీధి, వెంగళరావునగర్, ఐదులాంతర్ల సెంటర్, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, పాతూరు, సంకులవారితోట, తదితర ప్రాంతాల్లోని రామమందిరాల్లో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. సీతారాముల కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. భక్తుల పెద్దఎత్తున తలివచ్చి సీతారాముల కల్యాణాన్ని తిలకించారు. భక్తుల శ్రీరామనామస్మరణలతో ఆలయాల పరిసరాలు పులకించాయి. రాత్రి సీతారాముల గ్రామోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల వద్ద చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

అల్లూరు: స్థానిక కోదండరామస్వామి ఆలయంలో ఉదయం విశేషపూజలు నిర్వహించారు. అనంతరం సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మినర్వాగ్రాండ్ గ్రూప్ ఆఫ్ హోటల్స్ చైర్మన్ అల్లంపాటి లోకేశ్వరెడ్డి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నేత్రపర్వంగా సీతారాముల కల్యాణోత్సవం

ఉదయగిరి: ఉదయగిరి నియోజకవర్గంలోని వాడవాడలా శ్రీరామనవమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. రామమందిరాల్లో సీతారాములకు విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులకు పానకం, వడపప్పు ప్రసాదాలను పంపిణీ చేశారు. ఉదయగిరిలోని సుద్దబావి వీధిలో ఉన్న కోదండరామస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. అలాగే వింజమూరులోని కోదండ రామస్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గోళ్లవారిపల్లిలో శ్రీరామ నవమి వేడుకలను మూడ్రోజుల పాటు వైభవంగా నిర్వహించారు. ఆదివారం మధ్యాహ్నం సీతారాముల కల్యాణాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. గోళ్లవారిపల్లి చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. విజయవాడకు చెందిన ఎంఎస్సార్ డెవలపర్స్ అధినేత మాధవరపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కోలాట, నృత్య ప్రదర్శనలను నిర్వహించారు.

సీతారామపురం : మండలంలోని అన్ని గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. రామాలయాలు భక్తులతో కిటికిటలాడాయి. సీతారామపురం పడమటి వీధిలోని రామాలయం వద్ద నుంచి పానకం బండిని కట్టి ఊరేగింపుగా గ్రామదేవత అంకాళమ్మ ఆలయం వద్దకు వెళ్లి పూజలు నిర్వహించారు. అలాగే స్థానిక కురువవీధిలోని రామాలయం వద్ద భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

కలిగిరి: మండలంలోని గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీతారాముల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి సంప్రదాయబద్ధంగా కల్యాణం జరిపారు.

దుత్తలూరు: మండలంలోని దుత్తలూరు, సోమలరేగడ, ఉలవవారిపాలెం, లక్ష్మీపురం, ఏరుకొల్లు, రాచవారిపల్లి, నర్రవాడ, తెడ్డుపాడు, కొత్తపేట, తదితర గ్రామాల్లోని రామాలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతారాముల కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. సాయంత్రం గ్రామోత్సవాలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

జలదంకి: మండలంలోని గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రామాలయాల్లో విశేష పూజలు, సీతారాముల కల్యాణోత్సవాలను కనులపండువగా నిర్వహించారు. చామదల హరిజనవాడ రామాలయంలో సీతారాముల కల్యాణోత్సవానికి వేమాల శ్రీనివాసులు, విజయలక్ష్మి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించి స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు.

కిటకిటలాడిన రామమందిరాలు

ఆత్మకూరు: ఆత్మకూరు నియోజకవర్గంలోని వాడవాడలా శ్రీరామనవమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఆత్మకూరులోని రామమందిరాలు భక్తులతో కిటకిటలాడాయి. సుందరమ్మ కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు పానకం, వడపప్పు, అన్నప్రసాద వితరణ చేశారు. ఉభయకర్తలుగా గుండాల పరమేశ్వరరెడ్డి దంపతులు వ్యవహరించారు. రాత్రికి శ్రీరాముని పట్టాభిషేక మహోత్సవాన్ని నిర్వహించారు. ఉభయకర్తలుగా అపర్ణ, చక్రవర్తి, కుటుంబ సభ్యులు వ్యవహరించారు. పంటవీధి రామాలయంలో సీతారాముల కల్యాణాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

ఆత్మకూరురూరల్: మండలంలోని గండ్లవేడులో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా గరుడ వాహన సేవను వైభవంగా నిర్వహించారు. విష్ణుమూర్తి అవతారంలో శ్రీరామచంద్రమూర్తి భక్తులకు దర్శనం ఇచ్చారు. దేవూరులోని భగవాన్ వెంకయ్యస్వామి ఆశ్రమంలోని కోదండ రామస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. కరణం నాగేశ్వరరావు, కృష్ణవేణి దంపతుల ఉభయకర్తలుగా వ్యవహరించారు.



వింజమూరు: గోళ్లవారిపల్లిలో విశేషాలంకారంలో సీతారాములు

అనుమసముద్రంపేట: మండలంలోని గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనుమసముద్రంలోని రామమందిరంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు.

సంగం: మండలంలోని జంగాలదొరువు గ్రామంలోని కోదండ రామస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఎదురు భాస్కర్ నాయుడు, అరుణమ్మ, ఎదురు వెంకటేశ్వర్లు, దొరసానమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. సంగంలోని ఆంజనేయస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కల్యాణాన్ని తిలకించారు.



ఉదయగిరిలో సీతారాముల కల్యాణోత్సవం



ఆత్మకూరు: సుందరమ్మ కోదండ రామాలయంలో..



అనుమసముద్రంలో విశేషాలంకారంలో సీతారాములు



సీతారామపురంలో పానకం బండి ఊరేగింపు



కావలి: జనతాపేట రామమందిరంలో సీతారాముల కల్యాణోత్సవం



కావలి: ఉత్తరంపేట రామాలయంలో చిన్నారుల కోలాట ప్రదర్శన



జలదంకి: చామదల హరిజనవాడ రామాలయంలో..



కలిగిరి మండలం కృష్ణారెడ్డిపాలెంలో..



దుత్తలూరు: ఉలవవారిపాలెం రామాలయంలో..



ఆత్మకూరురూరల్: గండ్లవేడులో గరుడ సేవ

క్లుప్తంగా

చలివేంద్రాల ప్రారంభం



కలిగిరి: స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయం, సాయిబాబా మందిరం సమీపంలో చలివేంద్రాలను ఆర్‌ఆర్‌ఆర్ టిఫిన్ షాపు నిర్వాహకుడు రావూరి రమేష్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. శ్రీరామనవమి పురస్కరించుకుని పానకం, వడపప్పు పంపిణీ చేశారు.

రొట్టెలు,పండ్ల పంపిణీ

కావలి: ఏరియా వైద్యశాలలోని రోగులకు పండ్లు, రొట్టెలను ఆదివారం పంపిణీ చేశారు. పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్ జన్మదినం సందర్భంగా సీహెచ్‌వీ సుబ్బారావు, ఆనంద్, శేఖర్‌లు ఆస్పత్రి సూప రింటెండెంట్ పద్మావతి, అభివృద్ధి కమిటీ సభ్యుడు రామకృష్ణ చేతుల మీదుగా అందజేశారు.

వైద్యశిబిరం

ఆత్మకూరు: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పట్టణంలోని షిర్డీ సాయిరామ్ పాఠశాల ఆవరణలో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. రోగులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి రెండు నెలలకు సరిపడా మందులను తక్కువ ధరకే అందజేశారు. జేవీవీకి చెందిన హరికృష్ణ, ఎస్కే సందానీ, మురళి పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



ఆత్మకూరు(చేజర్ల): చేజర్ల మండలం ఆదూరుపల్లిలో రెడ్‌క్రాస్ సహకారంతో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. శ్రీరామనవమిని పురస్కరించుకుని గ్రామ యువత ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో పలువు రు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఉపాధ్యాయుడు మల్లికార్జున స్ఫూర్తితో రక్తదాన శిబిరాన్ని నిర్వహించినట్లు యువత తెలిపారు.అనంతరం మల్లికార్జునను శాలువాతో సన్మానించారు.

ముగ్గుల పోటీలు



సీతారామపురం: శ్రీరామనవమిని పురస్కరించుకుని సీతారామపురంలోని రాజుగారి వీధిలో నూతనంగా నిర్మిస్తున్న సీతారామ మందిరం ప్రాంగణంలో పాలగిరి శివకుమార్‌రాజు (వలంటీర్) జ్ఞాపకార్థంగా మహిళలకు ముగ్గు ల పోటీలను ఆదివారం నిర్వహించారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.1,116, ద్వితీయ బహుమతి రూ.600, తృతీయ బహుమతి రూ.500 నగదు, ప్రోత్సాహక బహుమతులను మాజీ ఎంపీపీ మాధవీలత చేతుల మీదుగా అందజేశారు.

డ్రాయింగ్ మాస్టర్‌కు అవార్డు



ఆత్మకూరు(చేజర్ల): చేజర్ల ఉన్నత పాఠశాలకు చెందిన డ్రాయింగ్ మాస్టర్ తోట కిషోర్‌కుమార్ డ్రీమ్‌వర్క్ ఆర్ట్ గ్యాలరీ సంస్థ నుంచి అవార్డును అందుకున్నారు. విజయవాడలో డ్రీమ్‌వర్క్ ఆర్ట్ గ్యాలరీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి చిత్రకళ పోటీల్లో చేజర్ల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు సీనియర్, జూనియర్ విభాగాల్లో ఉత్తమ ప్రతిభకనబరిచి పురస్కారాలను అందుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన తోట కిషోర్‌కుమార్‌ను డ్రీమ్‌వర్క్ ఆర్ట్ గ్యాలరీ సంస్థ నిర్వాహకులు శనివారం రాత్రి విజయవాడలో జరిగిన కార్యక్రమంలో అవార్డును అందజేసి అభినందించారు.

కుట్టు శిక్షణ సర్టిఫికెట్ల అందజేత

కావలి: పట్టణంలో సాయి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు పొన్నగంటి మాధవి ఆధ్వర్యంలో ప్రవాస భారతీయులు మిండె శ్రీనివాస్ సహకారంతో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణా కేంద్రంలో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లను ఆదివారం అందజేశారు. అనంతరం మిండె శ్రీనివాస్, రమాదేవి దంపతుల కుమార్తె జ్యోతిర్మయి పుట్టినరోజు సందర్భంగా అనాథ బాలికలకు వస్త్రాలను వితరణ చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

నేడు కుట్టు శిక్షణ కేంద్రాల ప్రారంభం

ఆత్మకూరు: ఏపీ బీసీ వెల్ఫేర్ సంస్థ, ఈడబ్ల్యూఎస్ సంయుక్త సహకారంతో ఆత్మకూరు నియోజకవర్గంలో నిర్వహించనున్న ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాలను మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సోమవారం ప్రారంభించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ తెలిపారు. సాయంత్రం 4 గంటలకు మర్రిపాడు ఆర్‌బీకే, 5 గంటలకు ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయం, 5.30 గంటలకు ఎంపీడీఓ కార్యాలయం, 6.30 గంటలకు సంగం ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణ కేంద్రాలను మంత్రి ప్రారంభించనున్నారు.

అందని వైద్యం.. రోగుల దైన్యం

- ఇద్దరు వైద్యులు ఉన్నా అందని 24 గంటల వైద్య సేవలు
- కాన్పులు చేయడంలోనూ నిర్లక్ష్యం
- ఆస్పత్రి అభివృద్ధి నిధులు పక్కదారి
- నేడు పీహెచ్‌సీలో కేంద్ర బృందం విచారణ



జలదంకి: జలదంకిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటలు వైద్యసేవలు అందడం లేదు. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో కూడా వైద్య సదుపాయాలు 24 గంటలు అందుబాటులో ఉండే విధంగా పీహెచ్‌సీల్లో ఇద్దరు వైద్యులను నియమించింది. జలదంకి పీహెచ్‌సీలో కూడా నాలుగేళ్లుగా ఇద్దరు వైద్యులు ఉన్నారు. మొదట్లో ఇద్దరు వైద్యులు ఉంటే వైద్య సేవలు మెరుగుపడతాయని మండల ప్రజలు భావించారు. అయితే రానురాను వైద్యుల నిర్లక్ష్యంతో పీహెచ్‌సీలో వైద్యసేవలు సక్రమంగా అందడం లేదు. ఇద్దరు వైద్యులు షిఫ్టుల వారీగా సేవలందించాల్సి ఉన్నా అలా విధులు నిర్వహించడం లేదు. కనీసం పగటి పూట కూడా వైద్యులు సక్రమంగా అందుబాటులో ఉండడం లేదు. దీంతో రోగులు ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. పీహెచ్‌సీలో కంటే ఆర్‌ఎంపీల వద్దే ఓపీ ఎక్కువగా నమోదవుతుండడమే అందుకు నిదర్శనం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల తరువాత పీహెచ్‌సీలో వైద్యసేవలు సక్రమంగా అందకపోవడాన్ని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి ప్రజలు తీసుకెళ్లారు. ఆ సమయంలో ఎమ్మెల్యే ఆస్పత్రిని సందర్శించి విధులు సక్రమంగా నిర్వహించాలని వైద్యులను ఆదేశించారు. అయినా పీహెచ్‌సీ వైద్యసిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆస్పత్రిలో కాన్పులు సైతం చేయడం లేదు. నాలుగున్నరేళ్లలో 57 కాన్పులు మాత్రమే జరిగినట్లుగా వైద్య సిబ్బంది చెబుతున్నారు. ఇంటి దగ్గర ప్రసవించిన మహిళలను తీసుకొచ్చి ఫొటోలు తీసి ఆస్పత్రిలో కాన్పులు చేసినట్లుగా రికార్డుల్లో నమోదు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల బీజేపీ నేత సమాచార చట్టం ద్వారా ఆస్పత్రికి సంబంధించి నాలుగేళ్ల అభివృద్ధి నిధుల వివరాలను సేకరించి అందులోని అవకతవకలను బయటపెట్టడం జరిగింది. గత ప్రభుత్వ హయాంలో నాడు–నేడు కింద పీహెచ్‌సీని సుందరంగా తీర్చిదిద్దగా ఏడాదిలోగానే తలుపులు విరిగిపోయాయని మరమ్మతులకు బిల్లులు పెట్టినట్లుగా తెలిసింది. అలాగే ఓపీ రిజిష్టర్ ప్రింటింగ్‌కు రూ.7,643 ఖర్చు చేసినట్లుగా నమోదు చేశారు. ఇలా రకరకాలుగా ఆస్పత్రి అభివృద్ధి నిధులను పక్కదారి పట్టించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే గత ఏడాది కాలంగా ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్ పోస్టు ఖాళీగా ఉంది. గతంలో ల్యాబ్‌టెక్నీషియన్‌గా పనిచేస్తున్న రసూల్‌తో డాక్టర్లకు విభేదాలు తలెత్తాయి. దీంతో 18 నెలలుగా జీతం బిల్లు కూడా పెట్టకుండా వైద్యులు తనను వేధిస్తున్నారని రసూల్ ఆరోపిస్తున్నాడు. అలాగే వైద్యులు తమను బదిలీ చేయకుండా డీఎంహెచ్‌కు సైతం భారీగా లంచాలు అందజేస్తున్నారనే ఆరోపణలు కూడా వస్తున్నాయి. కాగా వైద్యులపై వస్తున్న అభియోగాలపై సోమవారం జలదంకి పీహెచ్‌సీని కేంద్ర బృందం సందర్శించి విచారణ చేపట్టనున్నట్లుగా తెలిసింది. ఈ అభియోగాలపై డాక్టర్ శ్రీనివాసులను వివరణ కోరగా తాము విధులు సక్రమంగా నిర్వహిస్తున్నామని, ఆస్పత్రి అభివృద్ధి నిధుల్లో ఎలాంటి అవినీతి జరగలేదని, కొందరు తమపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని పేర్కొన్నారు.

హైఓల్జేజ్‌తో గృహోపకరణాలు దగ్ధం



సోమశిల: అనంతసాగరంలోని బస్టాండ్ వెనుక వీధుల్లో ఆదివారం వేకువజామున విద్యుత్ హైఓల్టేజ్ సరఫరా కావడంతో పలువురి గృహాల్లోని విద్యుత్ ఉపకరణాలు కాలిపోయాయి. సుమారు పది గృహాల్లోని ఫ్యాన్లు, ఫ్రిజ్‌లు, ఏసీలు, కూలర్లు కాలిపోయాయి. భారీగా నష్టం వాటిల్లడంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై విద్యుత్‌శాఖ ఏఈ మురళిని వివరణ కోరగా, హైఓల్టేజీ సరఫరా వాస్తవమేనని, అందుకు గల కారణాలను తెలుసుకుని విద్యుత్ లైన్లను సరిచేస్తామని తెలిపారు.

వైభవంగా ధ్వజారోహణం



సంగం: స్థానిక కామాక్షిదేవి సమేత సంగమేశ్వరాలయంలో బ్రహ్మోత్సవాలు శనివారం అర్ధరాత్రి ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. తొలుత సంగమేశ్వరస్వామి, కామాక్షిదేవి మూలవిరాట్లులకు విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం బ్రహ్మోత్సవాలకు ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజారోహణం చేశారు. భక్తులకు కొడి ముద్దలు పంపిణీ చేశారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ చైర్మన్ గునుపూడి గిరి, టీడీపీ మండలాధ్యక్షుడు శ్రీనివాసులుయాదవ్ పాల్గొన్నారు.

చారిత్రక నిలయం..చెన్నకేశవుని ఆలయం

- రేపట్నుంచి తొమ్మిదిరోజుల పాటు బ్రహ్మోత్సవాలు
- ముమ్మరంగా ఏర్పాట్లు

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులో వెలిసియున్న శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి తొమ్మిది రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని రంగులతో ముస్తాబు చేశారు. విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. బ్రహ్మోత్సవాలకు వింజమూరు పరిసర ప్రాంతాలతో పాటు బయట ప్రాంతాల్లో స్థిరపడిన వారు పెద్ద ఎత్తున తరలివచ్చే అవకాశం ఉంది. అందుకనుగుణంగా ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు, పోలీసులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆలయ చరిత్ర

చెన్నకేశవస్వామి ఆలయానికి పురాతన చరిత్ర ఉంది. 11వ శతాబ్దంలో శ్రీరామానుజాచార్యుల ఆగమనం సందర్భంగా ఎంతో మహిమ గలిగిన శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఆలయాన్ని నిర్మించారు. ఆ తరువాత 1818 లో ఆలయాన్ని అభివృద్ధి చేశారు. 1828 లోగర్భాలయం, ప్రహరీ, గోపురాన్ని నిర్మించినట్లు శాస నాల ద్వారా తెలుస్తోంది. ఇందుకోసం గణ వంవంశీయులు తమ ఆస్తుల్లో ఐదోవంతు కేటాయించినట్లుగా పెద్దలు చెబుతున్నారు. అప్పటి నుంచి 1985 వరకు ఆలయ భూముల ద్వారా వచ్చే కౌలుతో జియ్యంగార్ల ఆజ్ఞల మేరకు పూజలు నిర్వహించేవారు. 1986 లో ప్రభుత్వం దేవదాయశాఖలో విలీనం చేసి కార్యనిర్వ హణాధికారిణి నియమించింది. 1924లో చెన్నకేశవస్వామి రథోత్సవానికి 52 అడుగుల ఎత్తుతో రథాన్ని తయారు చేశారు. ఆ రథం 1974లో కాలిపోవడంతో నూతన రథాన్ని చేయించారు. ఇది24 అడుగుల ఎత్తుతో అత్యంత సుందరంగా రూపుదిద్దుకుంది.



చెన్నకేశవస్వామి ఆలయం

బ్రహ్మోత్సవ కార్యక్రమాలు



చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలకు మంగళవారం అంకురార్పణ చేయనున్నారు. 9న ధ్వజారోహణం, 10న పొన్నమానుసేవ, 11న హనుమాన్‌సేవ, 12న గరుడసేవ, 13న కల్యాణోత్సవం, 14న రథోత్సవం, 15న వసంతోత్సవం, 16న ఏకాంత సేవ నిర్వహించనున్నారు. రథోత్సవం రోజు స్వామి దర్శనం కోసం వేలాది మంది భక్తులు తరలిరానున్నారు. ఉత్సవాలు సందర్భంగా ప్రతిరోజూ భక్తులకు అన్నప్రసాద వితరణ చేయనున్నారు. ప్రతిరోజూ రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఎండు గడ్డి కోసం వెళ్లి వస్తుండగా..

- ట్రాక్టర్‌పై నుంచి జారిపడి వ్యక్తి మృతి

కావలి: మండలంలోని మూతివారిపాళేనికి చెందిన గుడిపల్లి వెంకటరమణయ్య (45) గౌరవరం సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. వివరాలు..వెంకటరమణయ్య విడవలూరు మండలం రామతీర్థం గ్రామానికి వెళ్లి ట్రాక్టర్‌లో ఎండుగడ్డిని లోడు చేసుకుని తిరిగి స్వగ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో గౌరవరం వద్ద ట్రాక్టర్ డ్రైవర్ పక్కన కూర్చుని ఉన్న వెంకటరమణయ్య జారి కింద పడ్డాడు. ట్రాక్టర్ టైర్ పైకి ఎక్కడంతో అక్కడికక్కడే మరణించాడు.

ఏసీ బిగిస్తూ భవనంపై నుంచి పడి..

పట్టణంలోని ముసునూరులోని ఒక భవనంలో రెండో అంతస్తులో ఆదివారం ఏసీ బిగించేందుకు వెళ్లిన జలదంకి మండలం బ్రాహ్మణక్రాక గ్రామానికి చెందిన సాయికిరణ్ (22) అనే యువకుడు ప్రమాదవశాత్తు జారి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన యువకుడ్ని చికిత్స కోసం నెల్లూరుకు తరలిస్తుండగా మరణించాడు. ఈ రెండు ప్రమాదాలపై కావలి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు..

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

కావలి/దుత్తలూరు/ఉదయగిరి/సోమశిల/జలదంకి: భారతీయ జనతా పార్టీ 45వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కావలిలోని శివాజీ సెంటర్‌లో పార్టీ జెండాను నాయకులు ఆవిష్కరించారు. దుత్తలూరులో మండలాధ్యక్షుడు లెక్కల వెంగళరెడ్డి, అనంతసాగరంలో మండలాధ్యక్షుడు వల్లూరు రాజేష్‌రెడ్డి, ఉదయగిరిలోని పంచాయతీ బస్టాండ్ ఆవరణలో మండలాధ్యక్షురాలు పీ విజయలక్ష్మి, జలదంకిలో మండలాధ్యక్షుడు ముడి కిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మిఠాయిలు పంచారు.